# నిద్ర రావడం లేదు

~ త్రిపుర



**పాత రచన:** నిద్ర రావడం లేదు (కథ)

**రచయిత:** త్రిపుర

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=315

©Author.

**What can you do with this document?**

Read it!

Store this PDF on your device.

Share the link with your friends

Share this PDF with your friends via personal communication (e.g. email)

Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.

Distributing to public (instead kindly share the link to Kinige given above)

త్రిపుర కథలపై చాలా సులువుగా "అబ్సర్డు", "సర్రియలిస్టిక్" ముద్రలు వేస్తారు. నిజానికి త్రిపుర కథల్లో సింహభాగం వాస్తవిక (రియలిస్టిక్) ధోరణిలో సాగేవే. కానీ ఆయన వచనం ఆ వాస్తవికతలోని కవిత్వాన్ని మాత్రమే ఎంపిక చేసుకుంటూ, ఆ ఎంపికను పాఠకుల ముందు ప్రదర్శనగా గాక తనకై తాను, తనలో తాను గొణుక్కుంటూ చెప్పుకు పోవటం వల్ల, అది అందరికీ అంత తొందరగా అర్థం గాక, పై ముద్రలకు తగిన రచనలకు కూడా ఆ అర్థంకానితనం ఒక లక్షణం కాబట్టి, త్రిపుర కథలకూ అవే ముద్రల్ని అతికిస్తారు.

ఒక్క "భగవంతం కోసం", "వలసపక్షుల గానం" కథల్లో మాత్రమే అసంగత, అధివాస్తవిక ఛాయలు కనిపిస్తాయి. "భగవంతం కోసం"లో కూడా కథనం అంతా వాస్తవిక ధోరణిలోనే సాగుతుంది. కథ మాత్రమే అసంగత ఛాయలు కలిగి ఉంటుంది. (తన అస్తిత్వానికి అర్థాన్ని వ్వగలిగే దైవం ఉనికి కోసం మనిషిలో అప్రత్యక్షంగా సాగే నిరీక్షణకి ఈ కథ ఒక పేరబుల్. ఈ ఇతివృత్తం అబ్సర్డ్ రచయితలుగా అంతా పేర్కొనే బెకెట్, కామూల రచనలకు దగ్గరగా ఉంది. కనుక దీన్ని అబ్సర్డు రచన అనటం సబబే.) ఇక "వలసపక్షుల గానం" కథని అధివాస్తవిక కథగా కనిపింపజేసే ఉపకథలన్నీ నిజానికి వేర్వేరు కాఫ్కా రచనల్ని ఒక చోటకి ఏరి తెచ్చి చేసిన స్వేచ్ఛానువాదాలు (నేరేటర్ భగవంతం కోసం బయల్దేరి అతని ఇల్లు కనుక్కుని అతనక్కడ లేకపోవటం, బస్సులో బిల్డింగు కాంట్రాక్టరు చెప్పే ఒక మధ్యాహ్నం నాటి సంఘటన, అలాగే వీరబాహు చెప్పే గోడ ముందు నిలబడే ఐదుగురి కథ... ఇవన్నీ కాఫ్కా అనువాదాలే.) వీటిని మినహాయించి చూస్తే "వలసపక్షుల గానం"లో మరీ అంత అర్థం కాని అధివాస్తవిక అంశాలేవీ లేవు.

పోతే, ఈ "నిద్ర రావడం లేదు" అన్న కథ మాత్రం పూర్తిగా అధివాస్తవిక ధోరణిలోనే సాగుతుంది. ఇది 1988లో రాశారు. త్రిపుర కథల్లో అబ్సర్డూ, సర్రియలిస్టిక్కూ ఏమన్నా ఉంటే అది ఇదొక్కటే. నెలకొక పాత రచన ఇవ్వాలన్న ఆలోచన ప్రకారం ఈ నెల త్రిపుర కథా సంపుటిలో చేరని ఈ కథని ఇస్తున్నాం.

# నిద్ర రావడం లేదు

రైళ్ళు కుడి చెవిలోంచి దూరి ఎడమ చెవిలోంచి పైకి పోతున్నట్లు, ఎడమ వేపు తిరిగి పడుకుంటే ఎవరో ఎర్రటి గోళ్ళతో మెడపట్టుకుని చీరుతున్నట్టు, కుడి వేపు తిరిగితే డేల్మేషన్ కుక్క, ఎలుగుబంటి లాంటిది, ఆకురాయిలాంటి నాలికతో పరపర నాకుతున్నట్లు...

లేచి, అద్దంలో చూసుకుంటే కళ్ళల్లో ఒక్క అయోటా అయినా నిద్ర కనిపించదు. రిస్టువాచ్‌లో కాలం ఘోరంగా ముందుకు రాత్రిలోంచి తోసుకుంటూ... రెండు గంటల యిరవయి నిమిషాల పదహారు సెకండ్లు... పదిహేడు...

జగ్‌లోంచి మెల్లగా గ్లాస్‌లో నీళ్ళు పోసి మె...ల్ల...గా తాగి, ఆవులించి, పక్క మీద పల్లె పువ్వులాంటి షీట్ మీద ఒళ్ళు విరుచుకుంటూ పడుకుని – నటన – మళ్ళీ ఆవులిస్తూ, కళ్ళు మూసుకుని, ఆ క్షణంలో నిద్రపోయేవాడిలా – అంతా నటన – ఒళ్ళు కొంచెం ముడుచుకుని – అంతా ఎంత నటన – మిల్లులో నలిగి అలిసిపోయిన పెద్ద కూలీలాగ... ఏవో కలలొస్తున్నట్లు ఊహించుకోబోతూ వుంటే... డేల్మేషన్ గుర్రుమంటూ నాలికతో... ఈసారి ఎముకల్ని గీరుతున్నట్లు. ఆ ఎవరివో గోళ్ళు, పారల్లాంటి గోళ్ళు, మెడలో గుచ్చుకుంటున్నాయి.

“పాత విషయాలు, తియ్యటివి, ఏవో జ్ఞాపకం తెచ్చుకుంటూ పడుకో” అని ఎప్పుడో అన్నాడు భుజంగం ది సైకో అనలిస్ట్... పెన్సిల్ చెక్కుతూ దోసకాయ తరిగినట్లు తరగబడిన ఎడమచేతి చూపుడు వేలూ, అమాయకంగా పుస్తకం తీసి దుమ్ము దులుపుతుంటే క్రూరంగా కుట్టిన ఎర్ర తేలూ, పరధ్యాన్నంగా ఎదురింటి వేపు చూస్తుంటే తన వేపే ఎప్పుడూ కళ్ళప్పజెప్పి చూస్తుంటాడని భర్తతో రిపోర్ట్ చేసిన మహా యిల్లాలూ, కటకటాల్లో ఏమీ తోచక పెడితే మళ్ళీ తిరిగి రాదనుకున్న కుడికాలూ, ఆకాశం అంత న్యూస్ పేపర్ పేజీలో బొక్కి పన్నులాగ నా నంబరే లేని ఫరీక్షా ఫలితాలూ.....

యివీ.

ఎవరివో ఆ గోళ్ళు జూగ్యులర్ రక్త నాళంలోకి గుచ్చుకుని...

డేల్మేషన్ స్థిరంగా కూచుని ఎముక చుట్టూ మిగిలిన మాంసాన్ని చీకుతూ...

"అది కూడా పని చెయ్యకపోతే గొర్రెల్ని లెక్క పెట్టు. వెస్టర్నర్స్ అలాగే చేస్తారు" అన్నాడు ఈ మధ్యనే భుజంగం ది సైకో. భుజంగానికి క్లయింట్స్ లేరు. సెల్ఫ్ మీదనే ప్రయోగాలు. దారిన పోతూంటే నేనొకణ్ణి దొరికాను. మొత్తం ఇద్దరు.

... తొమ్మిది వందల తొంభయి ఆరు... తొమ్మిది వందల తొంభయి ఏడు... ఎన్నో వందల నలభయి ఎనిమిది... ఎన్నో వందల నలభయి తొమ్మిది...

గొర్రెల్ని దగ్గరగా ఎప్పుడూ చూడలేదు. చూసినట్లు జ్ఞాపకం లేదు. చాలా కాలం నుంచీ నాలో ఒక ఊహ. పల్లెటూర్లో నాకో ఇల్లు. గజపతి నగరంలో? కారంపూడిలో? తాడి, దువ్వాడ, బండ మీద? కమ్మ పల్లె? నాకో పెద్ద పొలం. "మాగాణి". నాకో రైతు. వెంకయ్య? ఈరినాయుడు? గురప్ప? రొబ్బి సోమన్న? సోమన్నే. వాడి పాకలో గొర్రెలు, మేకలు, ఆబోతులు. కొట్టాం. నేనక్కడకి సమ్మర్ లో సిస్తులు వసూలికి. చిన్న స్టేషన్ దిగి ఎద్దుబండి. రామినాయుడు, కాదు సోమన్న వంగి వంగి దండాలు. డబ్బు, నలిగిన నోట్లు. వేడిగా పాలు కంచు గ్లాసులో. ఇంటి వెనక గొర్రెలు. గొర్రెలెలా వుంటాయి? మేకల్లాగ వుంటాయా? అసలు మేకలెలా వుంటాయి. ఇంకా అసలుకి వస్తే మేకలంటే ఏమిటి? గొర్రెలకీ, మేకలకీ భేదం?

.... ఏభయి వేల తొంభయి నాలుగు... ఏభయి వేల తొంభయి ఆరు... తొంభయి వేల తొమ్మిది వందల ముప్పయి నాలుగు....

ఈ గొర్రెలు పెరట్లో కంచె మీంచి గెంతుతున్నాయి. గెంతుతుంటే నా లెక్క.

పక్కింటి "బుగత" కిష్టయ్య కూతురొచ్చి వీధిలో నిలబడి అరుస్తూంది. తలుపు రెండంగుళాలు తెరిచి "ఎందుకు?" అన్నాను.

"మీ గొర్రెలు మా చేన్లో పడి పెసలన్నీ తినేస్తున్నాయి."

ఎడ్మినిస్ట్రేటివ్ ప్రాబ్లమ్. డెసిషన్ తీసుకోవాలి చప్పున. సోమన్నని పిలిచి "చూడు. ఏదో చెయ్యి" అన్నాను. సోమన్న ఒక కర్ర – లావుగా, గుణుపులతో? – పట్టుకుని పంచ పైకెగ్గట్టి దూకేడు కిష్టయ్య చేన్లోకి. కర్రతో సాము చెయ్యడం మొదలు పెట్టేడు. గొర్రెలు రూట్ మార్చి వెనక్కి తిరిగి గెంతుతున్నాయి.

.... తొంభయి తొమ్మిది వేల తొమ్మిది వందల ముప్ఫయి అయిదు... తొంభయి తొమ్మిది వేల తొమ్మిది వందల ముప్ఫయి ఆరు... తొంభయి తొమ్మిది వేల తొమ్మిది వందల ముప్ఫయి ఏడూ....

గొర్రెల కాళ్ళు విరుగుతున్నాయి. పుర్రెలెగుర్తున్నాయి. చెవులు, గొర్రెకి చెవులుంటాయా? – చెవులు తెగుతున్నాయి. నిండుగా, అన్ని అవయవాల్తోనూ లేవు గొర్రెలు.

... ఎన్నో వేల ఎన్నో వందల ముప్ఫయి ఆరూ డెసిమల్ రెండూ... డెసిమల్ మూడూ... పాయింట్ నాలుగు... డెసిమల్ అయిదూ... ఎన్నో వేల ఎన్నో వందల ముప్ఫయి ఒకటీ పాయింట్ ఆరూ...

సోమన్నేడీ? గెంతే గొర్రెనొక(డి)ని? నొక(ర్తి)ని? పట్టుకుని, నోరు విప్పి చూస్తే పళ్ళు రక్తమయం. సోమన్నేడీ? చేనంతా వెతికితే ఓ మూలని సోమన్న – ఉత్త ఎముకలతో సోమన్న – గొర్రెలు తినేశాయి సోమన్నని.

ఇంకో ప్రాబ్లమ్. ఊరి చివర పోలీస్ ఠాణా. కేసులు ఏమీ లేక, ఏమీ తోచక, ఠాణా కాంపౌండ్‌లో బంతి మొక్కలు పెంచుతున్న రేలంగి లాంటి కాన్స్టబుల్‌తో "సోమన్నని గొర్రెలు తినేశాయి, రాసుకోండి" అని చెప్పి, వెనక్కి తిరిగి రాబోతూంటే, చెయ్యి పట్టుకులాగి, బఱ బఱ వీధిలోకి లాక్కొచ్చి, టౌనుకు పోయే ఒక లారీ ఎక్కించి, నాతోనే తనూ వచ్చి, భుజంగం ఇంటికి తీసుకు వచ్చి తలుపు తట్టేడు రేలంగి.

భుజంగం తలుపు తీస్తుంటే పై నుంచి, అంటే తలుపు మీదనే పెట్టి వుంచిన ఒక బకెట్ నీళ్ళు పడ్డాయి ముగ్గురి మీదా.

"బకెట్ కాంప్లెక్స్. ఓల్డ్ జోక్. లారెల్ అండ్ హార్డీ. జడవకండి. తడిపినా వణక్కండి. బెదరక లోనికి రండి" అన్నాడు. లోపలికి తీసుకు వెళ్ళేడు.

"ఎన్ని?" అన్నాడు.

"ఎన్నో వేల ఎన్నో వందల ముప్ఫయి మూడూ" అన్నాను తడుముకోకుండా.

నోట్ చేసుకున్నాడు నల్లటి డైరీలో.

రేలంగి అడిగేడు. “నన్ను కూడా నోట్ చేసుకోమంటారా?”

“వీడెవడ”న్నాడు భుజంగం.

“వీడో బంతి మొక్క. వీడి కడ నిలచి, చివాలున వంచి...”

“బంతి మొక్కయితే వెళ్ళి బంతి పువ్వులు పూయమను. ఎర్రటోపీ పూస్తాడెందుకూ?”

“అదొక ఎబరేషన్” అన్నాను సంజాయిషీగా.

రేలంగి ఒక విలన్ నవ్వు నవ్వి, “నా కన్నీ తెలుసు. ఫ్రాయిడ్, యుంగ్, ...., ఆల్బర్ట్ కామూ నేను చదవలేదనుకున్నారా. అదంతా మా ట్రెయినింగ్‌లో వుంది. అంతా కొట్టిన పిండే మాకు. అయినా, అంతగా మీరు యిదవుతుంటే...” అంటూ బంతి మొక్కగా మెల్లగా మారుకుంటూ అలాగే నడుస్తూ పైకి వెళ్ళిపోయాడు.

భుజంగం చెక్కిన పెన్సిల్ ముల్లుని కసిగా నోట్లో పెట్టుకుని నములుతూ “ఇదిగో. నేనొక టెస్ట్ చేస్తాను” అని టేబుల్ కింద దూరి, ఏదో తీసి, పైకి లేచి చేత్తో ఒక చాకు చూపించి,

“దీన్ని చూస్తే నీకు తట్టే మాటేమిటి?” అని అడిగేడు.

“మళ్ళీ” అన్నాను.

బోధపడలేదు భుజంగానికి.

“ఏమిటి?” అన్నాడు.

“మళ్ళీ టేబుల్ కింద దూరి అది తియ్యి” అన్నాను. “అప్పుడేదో మాట తట్టుతుంది.”

“పేరు భుజంగం అయినా, మనిషి భల్లూకం.

మళ్ళీ కింద దూరి వగరుస్తూ పైకి లేచి “ఇప్పుడూ?” అన్నాడు ఆయాసపడుతూ.

“యథార్థం”

“మరీ ఆబ్వియస్. ఇంకో టెస్ట్.” టేబుల్ డ్రాయర్ లోంచి ఏదో తీసి చూపించకుండా, “ఇదేమిటో చెప్పు” అన్నాడు.

"ఖడ్గమృగం తోలుతో తయారు చేసిన ఏష్ ట్రే. దీనిని పలు విధముల ఉపయోగించవచ్చు. ఒకటి..."

"నక్కలాంటి వాడివి. జిత్తులమారి. కలా లేదూ, పాడూ లేదూ, కాంప్లెక్సూ లేదూ. పో" అని లోపలికి పాములాగ జరజర పాకిపోయాడు.

తిరిగి వస్తుంటే సోమన్న ఎదురుపడ్డాడు. "బెంబేలు పడకండి. నేను సోమన్ననే. గొర్రెలు తినేసింది కిష్టయ్యని" అన్నాడు.

"అయితే, కోర్టులో ఎలా" అన్నాను వర్రీడ్‌గా.

... "సోమన్నని గొర్రెలు తినేశాయా? గొర్రెల్ని సోమన్న తినేశాడా? సదరు సోమన్న బతికే ఉన్నాడా? సదరు గొర్రెలు, సదరు కిష్టయ్య... యివన్నీ చాలా భారీ విషయాలు. జ్యూరీ వారు సావకాశంగా ఆలోచించి నిర్ణయానికి రండి" అన్నారు జడ్జ్.

"నాట్ గిల్టీ" అన్నారు జ్యూరీ ఒక్క గొంతుకతో, ఆ క్షణంలోనే.

"ఎవరు నాట్ గిల్టీ? ఏమిటి మీ వాగుడు" కోపంగా జడ్జ్.

"మాకేం పని లేదా? మీ ప్రశ్నలకి జవాబులివ్వడానికి? పొలాలు దున్నుకోవాలి. నార్లు పాతాలి. ఏతాం కిర్రు. జనప... కలప... అంటు మామిడి గెలలు... గెత్తాం... కవులుకి..." అంటూ జ్యూరీ కండువాలు దులుపుకుంటూ పైకి గొర్రెల మందలాగ వెళ్ళిపోతూ వుంటే....

ఎన్నో లక్షల, యిన్ని వేల, అన్ని వందల నలభయి ఆరో గొర్రె కిష్టయ్య చేన్లోంచి పక్కనున్న మిషనరీ కాంపౌండ్ గోడ మీంచి గెంతుతూంది. గోడ గడియారం ఐదు కొట్టింది. ఐదు కొట్టిందా? ఒంటి గంట ఐదుసార్లు కొట్టిందా?

*

*(ప్రొఫెసర్ వింధ్య గారికి కృతజ్ఞతలతో...)*

For Latest Telugu Books - Visit now:

Kinige.com